నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శనివారం 25 మే 2024 | YADADRI BHUVANAGIRI

సజావుగా పాలీసెట్

భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ కళాశాలలో హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

భువనగిరి అర్బన్, మే 24 : పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన టీఎస్ పాలీసెట్- 2024 ప్రవేశ పరీక్ష శుక్రవారం సజావుగా జరిగింది. భువనగిరిలో 5 కేంద్రాలు, యాదగిరిగుట్టలో 2 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరిగింది. 1,496 మంది విద్యార్థులకు 1,373(బాలురు 754, బాలికలు 619) మంది హాజరైనట్లు పాలీసెట్ జిల్లా కో-ఆర్డినేటర్ షఫీజ్ అక్తర్ తెలిపారు.

బీఆర్ఎస్‌తోనే ప్రజా సమస్యలు పరిష్కారం

హామీల అమలులో కాంగ్రెస్‌వన్నీ అబద్ధాలే..

- కేసీఆర్ హయాంలోనే మునుగోడు సస్యశ్యామలం
- మిషన్ భగీరథతో ఫ్లోరైడ్‌ను తరిమికొట్టాం
- పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి కల్పించాం
- బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- చౌటుప్పల్‌లో మునుగోడు నియోజకవర్గ పట్టభద్రులతో సమావేశం

చౌటుప్పల్‌లో మునుగోడు పట్టభద్రుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేదికపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు కిశోర్, అంజయ్య, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

చౌటుప్పల్, మే 24 : 'అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ సీఎం కేసీఆర్, తాను మునుగోడులో ప్రచారం చేసి మోసగాళ్ల మాటలకు మోసపోవద్దని అని చెప్పినం. అయినా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నమ్మి ఓట్లిసినరు..దాంట్లో ఉన్న 13 హామీల్లో కేవలం ఒకటే మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేసింది తప్ప మిగతా వాటిని అమలు చేయలేదు. ఏరికోరి తెచ్చుకుంటే ఇప్పుడు ఎగిరిఎగిరి పడుతున్నరు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేసి మళ్లీ రెండోసారి మోసపోవద్దు. కాంగ్రెస్ పార్టీ మొదటి హెచ్చరిక జారీ చేసే ఎన్నిక ఇదే. ఇందుకోసం బీఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఖమ్మం-వరంగల్, నల్లగొండ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలోని శ్రీ బాలాజీ గార్డెన్‌లో నిర్వహించిన మునుగోడు నియోజకవర్గ పట్టభద్రుల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు నకిరేకల్‌లో నియోజకవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తొమ్మిదిన్నరేండ్ల నిజం, 6నెలల అబద్ధం మీ ముందున్నదని, పట్టభద్రులు ఆలోచన చేయాలని కోరారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఎన్ని పార్టీలు మారిండో, సీఎం రేవంత్ రెడ్డి ఆయన ఎలా తిట్టుకున్నారో అందరికీ తెలుసన్నారు. ఎన్నో ఏండ్ల నుంచి ఉన్న ఫ్లోరైడ్‌ను తరిమికొట్టిన ఘనత బీఆర్ఎస్ సర్కారుదని, చౌటుప్పల్‌లో పైలాన్ పార్కును ఏర్పాటు చేసి మిషన్ భగీరథ ద్వారా కృష్ణా నీటిని అందించి మహానుభావుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. వెయ్యేండ్లు గుర్తుండి పోయేలా యాదాద్రి దేవాలయాన్ని కేసీఆర్ నిర్మించించారని చెప్పారు. దండుమల్కాపురంలో ఐటీ పార్కు తీసుకొచ్చామని, చౌటుప్పల్ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ పెరుగడానికి ఇది ఎంతో దోహద పడిందని అన్నారు. ఉమ్మడి జిల్లాలో 65 ఏండ్ల నుంచి మెడికల్ కాలేజీలు లేవని, మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో మూడు కాలేజీలు ఏర్పాటు చేశామని తెలిపారు. వరి ఉత్పత్తిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 1.8శాతం ఓట్ల తేడాతో ఓడిపోయిందని, పనిచేసి కూడా చెప్పలేకపోవడంతోనే ఓటమి పాలయ్యామని తెలిపారు. రాష్ట్రంలో 2లక్షల ఉద్యోగాలు ఇచ్చి కూడా బీఆర్ఎస్ చెప్పుకోలేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. అందుకే ప్రస్తుతం శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక కావాలని సూచించారు. సామాన్య వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి బిట్స్ బిలానీలో చదివి గోల్డ్‌మెడల్ సాధించిన రాకేశ్ రెడ్డికి ఓటు వేస్తే ప్రజా గొంతుకగా నిలుస్తాడని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నపై 54 క్రిమినల్ కేసులు ఉన్నాయని..74రోజులు చెంచలగూడలో జైలు జీవితం గడిపానని మల్లన్ననే ఎన్నికల అఫిడవిట్‌లో చెప్పాడని గుర్తు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు గోల్డ్‌మెడలిస్టుకు, పచ్చి బ్లాక్ మొయిలర్‌కు మధ్య జరుగుతున్నాయని తెలిపారు. బిట్స్ పిలానీ కావాలా.. పల్లీ బఠానీ కావాలా పట్టభద్రులు ఆలోచన చేయాలన్నారు. ఈ సమావేశంలో యాదాద్రి జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్, సూర్యాపేట జడ్పీ వైస్ చైర్మన్ గోపగోని వెంకటనారాయణ గౌడ్, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత క్యామ మల్లేశ్, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో సమావేశానికి హాజరైన మునుగోడు నియోజకవర్గ పట్టభద్రులు

నకిరేకల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, వేదికపై మాజీ మంత్రి కేటీఆర్, జడ్పీచైర్మన్లు నరేందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి, బీఆర్ఎస్ నేతలు చెరుకు సుధాకర్, క్యామ మల్లేశ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరులు

నకిరేకల్‌లో సమావేశానికి హాజరైన పట్టభద్రులు

పరిశ్రమల ద్వారా 20లక్షల మందికి ఉపాధి

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం తీసుకొచ్చి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక వేత్తలను హైదరాబాద్‌కు పరిచయం చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దే. భారతదేశంలో ఏ పరిశ్రమ పెట్టాలన్నా హైదరాబాద్ వచ్చేలా చేశారు. వీటి ద్వారా 20 లక్షల మందికి ఉపాధి దొరికింది. టీఎస్ ఐపాస్ ప్రవేశపెట్టి పరిశ్రమలు పెద్ద ఎత్తున ఏర్పాటయ్యేలా చేశారు. నిమిషం కరెంట్ పోకుండా చేయడంతోపాటు శాంతిభద్రతలు కాపాడటంతోనే పారిశ్రామిక వేతలు వచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక కావాలో, లేదంటే బ్లాక్ మెయిలర్ కావాల్లో నిర్ణయించుకోవాలి.

–మాజీ మంత్రి, సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి

మొదటి ప్రాధాన్యత ఓటు రాకేశ్‌రెడ్డికి వేసి గెలిపించాలి

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల గుణగణాలు, మంచి చెడులు చూసి పట్టభద్రులు నిర్ణయం తీసుకోవాలి. యూట్యూబ్ చానల్ అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ దందాలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులే బుద్ధి చెప్తారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. సొంతంగా ఎదిగి బిట్స్ బిలానీలో గోల్డ్ మెడల్ సాధించి విదేశాల్లో ఉద్యోగం పొందినా సొంత ఊరికి ఏమైనా చేయాలనే సంకల్పంతో తెలంగాణకు వచ్చారు. పట్టభద్రుల, నిరుద్యోగుల సమస్యలు తెలిసిన వ్యక్తి రాకేశ్‌రెడ్డిని గెలిపించుకుంటే శాసన మండలిలో తన గళం విప్పి కాంగ్రెస్ ప్రభుత్వంపై కొట్లాడి హక్కులను సాధిస్తాడు.

– చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే

అడ్డగోలు హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

అడ్డగోలు హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఐదు నెలల్లోనే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది. పట్టభద్రులు ఇదంతా గ్రహించి ఆపార్టీకి తగిన బుద్ధి చెప్పాలి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు గ్రహించాలి. పట్టభద్రులు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డిని గెలిపిస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయి.

–ఎమ్మెల్సీ ఎన్నికల మునుగోడు ఇన్‌చార్జి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

దగుల్బాజీ కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

పాలిచ్చే బర్రెను వదిలి పొడిచే దున్నపోతుకు తెచ్చుకున్నట్లు ఉంది కాంగ్రెస్ పాలన. ఫ్లోరైడ్ నిర్మూలనకు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీరు ఇచ్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌ది. కరువుకాటకాలకు నిలయమైన ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. మాయమాటలు చెప్పే దగుల్బాజీ కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలి. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి కావాలంటే శాసన మండలిలో ప్రశ్నించే గొంతుక కావాలి. ఇందుకోసం ఉన్నత విద్యావంతుడైన రాకేశ్ రెడ్డిని గెలిపించాలి.

– కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ

ఆత్మకూరు(ఎం)లో పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం), మే24 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్.ఎం మండల కేంద్రంలో శుక్రవారం పట్టభద్రులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. నిరుద్యోగులకు న్యాయం జరుగాలంటే రాకేశ్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఎన్నికల ఇన్‌చార్జి గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు సుదగాని హరిశంకర్ గౌడ్, తుంగ బాలు, కొరె భిక్షపతి, నాగరాజు, పరశురాములు, సతీశ్, విశాల్, వినయ్, మణికుమార్, మహేశ్, వంశీకృష్ణ, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో ఉద్యోగులకు బ్యాలెట్ పత్రాన్ని అందించి రాకేశ్‌రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

శాసన మండలికి విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డిని పంపించాలి

- కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మాయమాటలు నమ్మొద్దు
- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల

భువనగిరి అర్బన్, మే 24 : మాయమాటలు చెప్పి మోసం వారిని కాకుండా విద్యావంతుడైన ఏనుగుల రాకేశ్‌రెడ్డిని శాసనమండలికి పంపించాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కోరారు. భువనగిరి పట్టణంలో ఎల్ఐసీ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులు, పట్టభద్రులను ఆయన కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల నమూనా బ్యాలెట్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు మాయమాటలు చెప్పి పట్టభద్రులను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారన్నారు. పట్టభద్రుల సమస్యలపై ప్రశ్నించే వ్యక్తి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అని, ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే అది బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యపడుతుందన్నారు. అదే విధంగా భువనగిరి పట్టణంలోని పలు ప్రైవేటు జూనియర్ కళాశాల ఉపాధ్యాయులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి కలిసి ఎమ్మెల్సీ ఓటును రాకేశ్‌రెడ్డికి వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి ఇబ్రహీం, పట్టణ, మండల అధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, నాయకులు జడల అమరేందర్‌గౌడ్, కొలుపుల అమరేందర్, ఎనబోయిన ఆంజనేయులు, చింతల కిష్టయ్య, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, జడల యశీల్, అజీమ్, బబ్లూ, తాడెం రాజశేఖర్, సుభాశ్, పెంట నితీశ్, నాగారం సూరజ్ పాల్గొన్నారు.

పైవేటు జూనియర్ కళాశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ నమూనా బ్యాలెట్ పత్రాన్ని అందిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం : కలెక్టర్ హనుమంతు జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 24 : ఈ నెల 25 సాయంత్రం 4 నుంచి 27 సాయంత్రం 4 గంటల వరకు రాజకీయ పరమైన బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కే.జెండగే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వరంగల్ - ఖమ్మం - నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నిక పోలింగ్ ముగిసే 48 గంటల ముందు నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులుగానీ, రాజకీయ పార్టీలు గానీ ఎలాంటి బల్క్ ఎస్ఎంఎస్‌లు ఇవ్వకూడదన్నారు.

అథ్లెటిక్స్‌లో అంబోజు అనిల్‌కు 3 బంగారు పతకాలు

యాదగిరిగుట్ట, మే24 : జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ అంబోజు అనిల్‌కుమార్‌కు 3 బంగారు పతకాలు వరించాయి. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 22 నుంచి 23వరకు జరిగిన మొదటి పాన్ ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్-2024లో అనిల్ 45 సంవత్సరాల విభాగంలో 3 బంగారు పతకాలు సాధించారు. ఇందులో 400, 800, 3,000 మీటర్ల పరుగు పందెంలో విజేతగా నిలిచారు. త్వరలో ఆస్ట్రేలియాలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గతంలో సౌత్ కొరియా, థాయిలాండ్ దేశాల్లో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

నేటితో ప్రచారం పరిసమాప్తం

సాయంత్రం 4గంటల నుంచి అంతా గప్‌చుప్

- హోరాహోరీగా సాగిన ప్రచారం
- పటిష్ట యంత్రాంగంతో బీఆర్ఎస్ దూకుడు
- ప్రతి ఓటర్ తలుపుతట్టిన గులాబీ శ్రేణులు
- కాంగ్రెస్ అభ్యర్థికి హ్యాండిస్తున్న కీలక నేతలు
- పోలింగ్ ఏర్పాట్లతో అధికారులు సన్నద్ధం
- రేపు డిస్ట్రిబ్యూటర్ కేంద్రాల నుంచి పోలింగ్ సెంటర్లకు సిబ్బంది
- 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్

నల్లగొండ ప్రతినిధి, మే 24 (నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఉపఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడనుంది. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ ముగిసే సమయానికి సరిగ్గా 48గంటల ముందు ప్రచారాన్ని బంద్ చేయాల్సి ఉంటుంది. దాంతో నేటి సాయంత్రం నాలుగు గంటలతో మైకులు మూగబోయి జెండాలు పక్కకుపోయి అంతా గప్‌చుప్ కానుంది. ఇక ఆ తర్వాత పోల్ మేనేజ్‌మెంట్, పోలింగ్ ప్రక్రియ, ఏజెంట్ల నియామకంపై అభ్యర్థులు పూర్తిస్థాయిలో దృష్టి సారించనున్నారు. ఆదివారం ఉదయం నుంచి నియోజకవర్గ పరిధిలోని 12 జిల్లా కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూటరీ సెంటర్లలో పోలింగ్ సిబ్బందికి విధులు కేటాయిస్తూ సామాగ్రిని కూడా అందజేయనున్నారు. ఈ నెల 27న ఉదయం 8గంటల నుంచి పోలింగ్ మొదలై సాయంత్రం నాలుగు గంటలకు ముగియనుంది. పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లన్నీ ఇప్పటికే దాదాపు పూర్తి కావచ్చాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన వీటిని పర్యవేక్షిస్తున్నారు.

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ఇన్నాళ్లు ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ప్రచారాన్ని సాగించారు. ఓటర్ల నమోదు నాటి నుంచే మండలి ఎన్నికల హడావుడి మొదలుకాగా బీఆర్ఎస్‌తో పాటు మరికొందరు

అభ్యర్థులు ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడానికి ప్రయత్నించారు. చివరగా నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రతి అభ్యర్థి ప్రచారంపైనే పూర్తి స్థాయిలో కేంద్రీకరించారు. హోరాహోరీ ఎన్నికల ప్రచారంతో వాతావరణం పూర్తిగా వేడెక్కింది. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరోసారి ప్రజలకు వివరిస్తూ ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ మోసాలను ఎండగడుతూ ప్రచారాన్ని నిర్వహించింది. మిగతా అభ్యర్థులు ముఖ్యంగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పోలిస్తే బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్ని కోణాల్లోనూ మెరుగైన అభ్యర్థిగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో సక్సెస్ అయ్యారు. దాంతో ప్రధాన అభ్యర్థుల్లో రాకేశ్‌రెడ్డి వ్యక్తిత్వం, ఉన్నత విద్య,ఉద్యోగాలు, వ్యక్తిగత వ్యవహారశైలి, విషయ పరిజ్ఞానం, ప్రజా సమస్యలపై విస్తృత అవగాహన, స్పష్టతకు పట్టభద్రుల్లో మంచి ఆదరణ లభించింది ఓ వైపు కాంగ్రెస్ పార్టీ అసత్యారోపణలను తిప్పికొడుతూనే మరోవైపు కేసీఆర్ తెలంగాణను తీర్చిదిద్దిన వైనాన్ని వివరిస్తూ ఓటర్ల వద్దకు వెళ్తున్నారు. అభ్యర్థి రాకేశ్‌రెడ్డి కూడా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాన్ని చుట్టి వస్తూ సుడిగాలి పర్యటనలు చేశారు. జిల్లా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మర్లు, రాష్ట్ర, జిల్లా నేతలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి నేతల వరకు అంతా ఉప ఎన్నికల ప్రచారంలో భాగస్వాములయ్యారు.

రేపు డిస్ట్రిబ్యూటరీ కేంద్రాల నుంచి..

శనివారం సాయంత్రం నాలుగు గంటలతో ప్రచారానికి తెరపడనుండడంతో అభ్యర్థులంతా పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టనున్నారు. అధికారులు మాత్రం పోలింగ్ ఏర్పాట్లపై కేంద్రీకరిస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ప్రకటించిన అధికారులు సిబ్బంది నియామాకం కూడా పూర్తి చేశారు. వీరందరూ ఆదివారం ఉదయానికే ఆయా జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిబ్యూటరీ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. 12 జిల్లా కేంద్రాల్లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో వీరికి ర్యాండమైజ్ పద్ధతిలో పోలింగ్ కేంద్రాలను కేటాయించనున్నారు. కేటాయించిన విధంగా వీరికి పోలింగ్ సామగ్రిని అందజేసి విధులు నిర్వర్తించాల్సిన ప్రాంతాలకు పంపించనున్నారు. రాత్రికే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని 27న ఉదయం 6గంటల వరకే సర్వం సిద్ధంగా ఉండనున్నారు. ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన పోలింగ్ ఏర్పాట్లను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని ముందుకు నడిపిస్తున్నారు. ఇప్పటికే అభ్యర్థుల సంఖ్య 52 ఉండడంతో అందుకు అనుగుణంగా బ్యాలెట్ బాక్స్‌లను, బ్యాలెట్ పేపర్లను, ఇతర సామగ్రిని ఆయా జిల్లా కేంద్రాలకు చేరవేశారు. మరోవైపు పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన పోలీస్ బందోబస్తును కూడా సిద్ధం చేశారు. వీరంతా రేపటి నుంచి పూర్తి స్థాయిలో విధుల్లోకి వెళ్లనున్నారు. పోలింగ్ ప్రక్రియ పూర్తి సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లతో తాము సిద్ధంగా ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ప్రకటించారు.

పైపైనే కాంగ్రెస్ నేతల ప్రచారం

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గతంలో చేసిన ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు, తిట్ల పురాణాలతో ఆ పార్టీ ముఖ్యులు ప్రచారానికి ముఖం చాటేసినట్లు చర్చ జరుగుతున్నది. నల్లగొండ జిల్లా కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక్క రోజూ కూడా మల్లన్నకు మద్దతుగా ప్రచారానికి రాలేదు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా దూరంగా ఉన్నారు. జిల్లాలోని మిగతా ఎమ్మెల్యేలు కూడా పైపైనే ప్రచారానికి పరిమితమైనట్లు సమాచారం. ఇక ఖమ్మంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రచారం సంగతేమో గానీ... కనీసం తీన్మార్ మల్లన్నను కలిసేందుకు కూడా విముఖత చూపినట్లు సమాచారం. ఇట్లా మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని కీలక నేతలంతా అంటీముట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతున్నది. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మద్దతుగా బీజేపీ రాష్ట్ర నేతలు ప్రచారం చేస్తున్నా, ప్రచార ప్రభావం నామమాత్రంగానే కనిపిస్తున్నది.